18వ వసంతంలోకి...
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
ఎన్టీఆర్ - కృష్ణా
ఆదివారం 2 మార్చి 2025 పేజీలు 8



**రంజాన్ వేళలు**

ఇఫ్తార్
సా. 6:19 (ఆదివారం)
సెహరీ
ఉ. 5:07 (సోమవారం)

## పవిత్ర రంజాన్ మాసానికి ప్రత్యేక ఏర్పాట్లు



మసీదుల వద్ద ట్రాఫిక్, భద్రత, పారిశుద్ధ్య చర్యలు

తాగునీరు, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు

కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

2

### పీడీఎస్ బియ్యం పక్కదారి పట్టకుండా

# పటిష్ట నిఘా..

- అవకతవకలకు ఆస్కారం లేకుండా విస్తృత తనిఖీలు
- ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ హెచ్చరిక



**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మార్చి 01, మేజర్ న్యూస్ :** ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా అందించే పేదల బియ్యం పక్కదారి పట్టకుండా పటిష్ట నిఘా పెట్టడం జరిగిందని.. ఎక్కడా అవకతవకలకు ఆస్కారం లేకుండా విస్తృత తనిఖీలు చేపడు తున్నట్లు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. శనివారం కలె క్టర్ లక్ష్మీశ జి.కొండూరులో మూడో నంబర్ చౌక ధ౦ల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. లైసెన్సు, ఆన్‌లైన్ ప్రకారం స్టాక్ వివరాలు, సరుకు నాణ్యతతో పాటు డీలరు సక్రమంగా రికార్డులు నిర్వహిస్తున్నారా లేదా అనే విషయాలను పరిశీలించారు. ఎండీయూ-6 వాహనం ద్వారా లబ్ధిదారులకు సరుకులు అందజేసే ప్రక్రి యను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ రేషన్ దుకాణాలు, ఎంఎల్ఎస్ పాయింట్లు, ఎండీయూ ఆపరేటర్ల కార్య కలాపాలు తదితరాలను ఎప్పటికప్పుడు మిగతా 2లో...



### నేటి నుంచి దివ్యఖురాన్ అవతరించిన

## రంజాన్ నెల ప్రారంభం

- కఠోర ఉపవాస దీక్షలకు సిద్ధమైన ముస్లింలు
- విద్యుత్ దీపాలతో కళకళలాడుతున్న మసీదులు
- పేదవారికి సహాయం చేయడమే అసలైన రంజాన్
- షవ్వల్ నెలవంక కనిపించినప్పుడు ఈద్-ఉల్-ఫితర్

2



**అక్రమ వంతెన నిర్మాణం తొలగించేంత వరకు ఉద్యమం చేపడతాం** 6

## సేవా కార్యక్రమాల్లో రంగన్నగూడెం కృష్ణాజిల్లాకే ఆదర్శం



వివరాలు 4లో...

### విజయవాడ రూపురేఖలు మార్చిన

## ఘనత సిద్ధార్థ సంస్థలదే..



సిద్ధార్థ ఫౌండేషన్ ఉపకార వేతనాల పంపిణీలో మంత్రి కొల్లు రవీంద్ర 2లో

- లక్ష్యం మంచిదైతే విజయం సిద్ధార్థ సంస్థల్లా ఉంటుంది
- చిన్న కాలేజీతో మొదలై నేడు విద్యా కేంద్రంగా మారింది
- అంబేద్కర్, అబ్దుల్ కలాం స్ఫూర్తితో యువత ముందుకు వెళ్లాలి
- ప్రపంచంలో అత్యధిక యువ జనాభా కలిగిన దేశం మనదే
- నాడు ఏపీని ఐటీ కేపిటల్ చేశారు.. మనం ఏఐ కేంద్రంగా మారుద్దాం

## ఫ్యూచర్ శాస్త్రవేత్తలుగా పిల్లలు మారాలి

శ్రీచైతన్యలో సైన్స్ ఎక్స్ పోలో ప్రధానోపాధ్యాయులు కె.మహాలక్ష్మి 8



(మొదటిపేజీ తరువాయి)



### పీడీఎస్ బియ్యం పక్కదారి పట్టకుండా పటిష్ట నిఘా..

తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. జిల్లాలోని 957 రేషన్ దుకాణాలను, ఏడు ఎంఎల్ఎస్ పాయింట్లలో ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టడం జరుగుతోందన్నారు. పౌర సరఫరాల డిప్యూటీ తహ సీల్దార్లు ప్రతినెలా 20 దుకాణాలను తనిఖీ చేయాల్సిందేనని.. అదేవిధంగా తహసీల్దార్లు నెలకు అయిదు దుకాణాలను తనిఖీ చేయాలని స్పష్టం చేశారు. పౌర సరఫరాల డీఎం, జిల్లా పౌర సరఫరాల అధికారి ఎంఎల్ఎస్ పాయిం ట్లను తనిఖీ చేయాలన్నారు. పేదల ఆహార భద్రతకు వీలుకల్పించే పీడీఎస్ బియ్యంలో ఒక్క గింజ పక్కదారి పట్టినా సహించేది లేదని.. ఉల్లంఘనలపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ లక్ష్మీశ హెచ్చరించారు.

### పవిత్ర రంజాన్ మాసానికి ప్రత్యేక ఏర్పాట్లు



**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మార్చి 01, మేజర్ న్యూస్ :** పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు ఆచరిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేస్తారని.. ఈ నేపథ్యంలో మార్చి 2 నుంచి 30వ తేదీ వరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. రంజాన్ మాసం ప్రారంభం నేపథ్యంలో చేయాల్సిన ఏర్పాట్లపై సమన్వయ శాఖల అధికారులకు దిశానిర్దేశం చేసేందుకు కలెక్టర్ లక్ష్మీశ శనివారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో రెవెన్యూ, పోలీస్, విద్యుత్, మునిసిపల్, వైద్య ఆరోగ్యం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అగ్నిమాపక తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మసీదుల వద్ద పారిశు ధ్య కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. తెల్లవారుజామునే ముస్లిం సోదరులు మసీ దులకు వెళ్లి నమాజ్ చేస్తారని.. అందుకు తగ్గట్లు ఎలాంటి ఇబ్బంది లేకుం డా చూడాలన్నారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని అవసర మైతే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రార్థన సమయానికి ముందే తాగునీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఆటంకం కలగకుండా మసీదుల వద్ద విద్యుత్తు లైన్లను తనిఖీ చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. పోలీస్ యంత్రాంగం మసీదుల వద్ద శాంతిభద్రతలను పర్యవేక్షించాలన్నారు. పెద్ద, చారిత్రక మసీదుల వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని.. ఆరోగ్య శిబిరాలను కూడా ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. నమాజ్ అనం తరం ముస్లిం సోదరులు ఆహార సామాగ్రి కొనుగోలు చేయడానికి దుకా ణాలు అందుబాటులో ఉండేలా అనుమతులు మంజూరు చేయాలని కార్మిక శాఖ అధికారులను ఆదేశించారు. అగ్నిమాపక శాఖ అధికారులు కూడా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రార్థనలు ఆచరించే ఉపాధ్యాయు లు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, ఇతర ఉద్యోగులు గంట ముందే కార్యాలయాల నుంచి వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి అబ్దుల్ రబ్బాని, జిల్లా వక్ఫ్ బోర్డ్ ఇన్‌స్పెక్టర్ ఎండీ సూహా అలీషా, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, విజయవాడ నగరపా లక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### అగ్ని ప్రమాద నిరోధక అవగాహన కార్యక్రమం

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు అగ్ని ప్రమాదాలను నిరోధించడానికి ఎన్టీఆర్ కాంప్లెక్స్ లో శనివారం ఉదయం, వ్యాపారం చేస్తున్న వ్యాపారస్తులకు, వారి సిబ్బందికి అవగాహన కార్యక్రమం కల్పించారు విఎంసి ఫైర్ సిబ్బంది. ఈ కార్యక్రమంలో అగ్ని ప్రమాదం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన నిరోధక చర్యలు, అగ్ని ప్రమాద నిరోధక పరికరాలను ఉపయోగించు విధానము, అగ్ని ప్రమాదం జరిగినప్పుడు మంటలను ఎలా ఆర్పాలి, ఎటువంటి పరికరాలను ఉపయోగించాలి, ఫైర్ స్ప్రింక్లర్స్, స్మోక్ డిటెక్టర్, ఎక్కడెక్కడ అమర్చాలి, వాటి వలన స్మోక్ అలారం ఎలా వస్తుంది, అగ్ని ప్రమాదం జరగకుండా కాంప్లెక్స్ చుట్టూ ఫైర్ సేఫ్టీ మెజర్స్ ఏమేం ఉండాలి వంటి విషయాలపై వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజా, ఎన్టీఆర్ కాంప్లెక్స్ వ్యాపారస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నేటి నుంచి దివ్యఖురాన్ అవతరించిన రంజాన్ నెల ప్రారంభం

**కఠోర ఉపవాస దీక్షలకు సిద్ధమైన ముస్లింలు**

**విద్యుత్ దీపాలతో కళకళలాడుతున్న మసీదులు**

**పేదవారికి సహాయం చేయడమే అసలైన రంజాన్**

**షవ్వల్ నెలవంక కనిపించినప్పుడు ఈద్-ఉల్-ఫితర్**



**నందిగామ, మార్చి 1, మేజర్ న్యూస్ :** ఇస్లాంలో రోజా లేదా ఉపవాసం అనేది ప్రతి సంవత్సరం ఒక చాంద్రమాన నెల(రంజాన్) వ్యవధిలో జరిగే విస్తృతమైన




ప్రక్రియ. రోజా లేదా ఉపవాసం ఉన్న వ్యక్తి సూర్యోదయం నుండి సూర్యా స్తమయం వరకు వ్యక్తి తినడు, తాగుడు లేదా పొగ తాగుడు. రంజాన్ నెలలో ఒక వ్యక్తి తినడం, తాగడం నుండి సంయమనం పాటించడమే కాకుండా సానుకూల భావాలను పెంపొందించడానికి ఉత్పన్నమైన మానసిక స్థితికి కూడా వస్తాడు. దీనిని సాధించడానికి, ఇతరుల గురించి చేడుగా వినడం, మాట్లాడటం, లేదా ప్రతికూలంగా ఆలోచించడం నుండి తనను తాను నిగ్రహించుకోవాలి. దివ్య ఖురాన్ అవతరించిన నెలగా రంజాన్ నెల పరిగణించబడుతుంది. ప్రవక్త ముహమ్మద్ (స) రంజాన్ మాసంలో మొదటి ద్యోతకం పొందారు.దివ్య ఖురాన్ ఇలా చెబుతోంది:"ఓ విశ్వాసులారా! మీ పూర్వీకులపై ఉపవాసం విధించబడినట్లే మీ పై కూడా విధిచేపబడినది – తద్వారా మీలో భయభక్తులు జనించే అవకాసం ఉంది."ఉపవాసం, స్వీయ-శు ద్ధి యొక్క విస్తృతమైన ప్రక్రియ కూడా. ఒక నెల వ్యవధిలో ఈ స్వీయ-శు ద్ధీకరణ ప్రక్రియను పాటిస్తే దాని ప్రభావం మిగిలిన 11 నెలల వరకు ఉంటుంది, ఆ తర్వాత ఈ ప్రక్రియ పునరావృతమవుతుంది.

**సామాజిక ప్రాముఖ్యత:** సామాజిక శాస్త్రపరంగా చూస్తే, ఉపవాసం అనేది పేదలపట్ల సంఘీభావాన్ని తెలియజేస్తుంది. దాతృత్వం, పరిసరాలు, ఆతిథ్యం అనే భావనను వ్యక్తపరుస్తుంది. ఉపవాసం శరీరం, ఆత్మను శుద్ధి చేయడం లోపాటు మానవులను ఆదర్శ మానవులుగా మారుస్తుంది. దాతృత్వం: దాతృ త్వంలో పేదలకు సహాయం చేయడం కూడా ఉంటుంది. ఈ మాసంలో చిన్న మొత్తమైనా దానం చేస్తే 70 రెట్లు ఎక్కువ పుణ్యఫలం లభిస్తుందని చెబుతారు. ఒక ముస్లిం తన వ్యక్తిగత సంపదను నగదు, వస్తువులు రెండింటినీ లెక్కించి, పేదలు మధ్య పంపిణీకి 2.5% ఏ 'జకాత్'గా తీయాలని ఆదేశం. ప్రతిఫలంగా దేవుడు తన సంపద, ఆస్తిని కాపాడతాడని ముస్లిములు భావిస్తున్నారు. జకాత్ సామాజిక న్యాయం తీసుకురావడానికి ఎంత అద్భుతమైన పథకం. ధనవంతులు దీనిని పూర్తి చిత్తశుద్ధితో ఆచరిస్తే, నిరుపేదలకు ఆర్థిక సహాయం లభిస్తుంది.

**పొరుగు భావన:** ఇస్లాం లో పొరుగు భావన చాలా ముఖ్యమైనది. ఇది విస్తృత అర్థాలను కలిగి ఉంది. ప్రవక్త(స) ఇలా అన్నారు, "ఒకరు మొత్తం మానవాళితో మర్యాదగా ప్రవర్తించాలి, వారిలో ప్రధానమైనది మీ పొరుగువారు." నిజమైన ముస్లిం ఏ మానవుని ఆకలితో చూడలేడు, అంటే 'ఇఫ్తార్' త్యాగం చేయవలసి వచ్చినప్పటికీ, మరుసటి రోజు ఆహారం తీసుకోకుండా ఉపవాసం కొనసాగించడం. నిజమైన ముస్లిం మానవుడిని బాధలో చూడలేడు. ఇస్లాం ముఖ్యంగా 'రోజా' ఒక వ్యక్తికి మానవ ఆందోళనలు, విలువలను పరిష్కరించడం బోధిస్తుంది.

**ఆతిథ్య భావన:** ఆతిథ్యం గురించిన ప్రవక్త ఇలా అన్నారు: "అతిథి పాదాల చప్పుడు విని సంతోషించే వారి పాపాలను దేవుడు క్షమిస్తాడు". ముస్లింలు దేవుని నుండి క్షమాపణ పొందేందుకు మంచి విషయాలను ఆచరించడానికి ప్రయత్నిస్తారు కాబట్టి, దానిని సాధించడానికి ఉపవాసం కంటే మెరుగైన ప్రేరణ మరొకటి ఉండదు.

**నిజం మాట్లాడే అలవాటును అలవర్చుకోవడం:** రంజాన్ ఉపవాసం యొక్క గొప్ప ప్రయోజనాల్లో ఒకటి ఏమిటంటే, ఉపవాసం ఒక వ్యక్తిలో నిజం మాట్లాడే అలవాటును పెంచుతుందని భావిస్తున్నారు. భగవంతుని సృష్టిలో నీతిమంతుల మార్గము సత్యమార్గమని అంగీకరించబడింది."

**ప్రవక్త (స) ఇలా అన్నారు:** "వాస్తవమే చెప్పండి, అది ప్రజలకు చేదుగా లేదా అసహ్యంగా ఉండవచ్చు.నిజాయితీ ప్రతి ముస్లిం యొక్క ముఖ్యమైన లక్షణం. ఒక వ్యక్తి ఉపావాసం ఉండి నిజం మాట్లాడి, ఆతిథ్యం, పొరుగువారి భావనను ఆచరించి, దానధర్మాలు చేస్తే, అతను/ఆమె ఆదర్శ మానవుడు (ఇన్సాన్) మాత్ర మే కాదు, దేవుని ఆశీర్వాదాలు, రక్షణ కు అర్హులు అవుతారు.

# విజయవాడ రూపురేఖలు మార్చిన ఘనత సిద్ధార్థ సంస్థలదే





**సిద్ధార్థ ఫౌండేషన్ ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర**

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిది ద్దడంలో సిద్ధార్థ సంస్థల పాత్ర అభినందనీయమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. విజయవాడలోని సిద్ధార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 26వ వార్షిక ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. దాదాపు 26 సంవత్సరాలుగా సిద్ధార్థ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు స్కాలర్ షిప్స్ అందించి ప్రోత్సహించడం సంతోషంగా ఉంది. 1975లో చిన్న విద్య సంస్థగా ఏర్పాటై.. ఇప్పుడు ఏకంగా 18 విద్యాలయాలు ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో తొలి ప్రైవేట్ ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీ, ఫార్మా లాంటి కాలేజీలుసిద్ధార్థ విద్య సంస్థలకే సాధ్యమైంది. లాభాపేక్ష లేనందువల్లనే ఇంత పెద్ద సామ్రాజ్యం సాకారమైంది. సిద్ధార్థ కాలేజీలను చూస్తుంటే ఒక వైపు సంతోషం,మరోవైపు ఈర్ష్యగా ఉంది. గతంలో మచిలీపట్నంలోనే విద్య కేంద్రంగా ఉండేదని,సిద్ధార్థ సంస్థల కారణంగా.. విజయవాడ ఆ పేరును దక్కించుకుందని చమత్కరించారు. మెరుగైన చదువు తో మాత్రమే మెరుగైన జీవితం సాధ్యమవుతుందని యువత గుర్తుంచుకోవాలి. అంబేద్కర్, అబ్దుల్ కలాం స్ఫూర్తితో విద్యార్థులంతా ముందుకు వెళ్లాలి. గతం లో ఉన్నత విద్య అంటే ఎక్కడెక్కడికో వెళ్లాల్సి వచ్చేది. కానీ నేడు విద్య వ్యవస్థ మొత్తం మన ముంగిట్లోనే ఉంది. మనకు వచ్చిన అవకాశాలను అందిపుచ్చు కుంటూ లక్ష్యాల సాధనకు ప్రయత్నించాలి. రాష్ట్రానికి దశ దిశ మార్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే సాధ్యమైందన్నారు. రెసిడెన్షియల్ విద్యకు అన్న ఎన్టీఆర్ శ్రీకారం చుడితే.. ఇంజనీరింగ్ కాలేజీల ఏర్పాటుతో విద్య వ్యవస్థను మరో మెట్టు ఎక్కించిన ఘనత చంద్రబాబుకే సాధ్యం. ఆయన వలనే ధనవంతులకు మాత్రమే అనుకునే ఇంజనీరింగ్, మెడికల్ చదువులు పేదలకు కూడా దరి చేరాయి. కాలేజీలు ఏర్పాటు చేయడంతోనే కాకుండా.. చంద్రబాబు నాయుడు ఐటీ విప్లవం తీసుకొచ్చి లక్షలాది మందికి అవకాశాలు కల్పించారు. ఐటీని ప్రోత్సహించి, ప్రపంచంలో ఏ మూలకు వెళ్లినా తెలుగు వారు ఉండేలా చేశారు. మన రాష్ట్రంలోని మానవ వనరుల్ని ప్రపంచ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలనే తపనతో పని చేస్తున్నాం. గతంలో ఐటీని అందిపుచ్చుకున్నాం.. ఇప్పుడు ఏఐని అందిపుచ్చుకోవాలి. పేదలు కూడా విదేశాల్లో చదువుకోవాలనే ఉద్దేశ్యంతో విదేశీ విద్య పథకాన్ని తీసుకొచ్చాం. వేలాది మందిని విదేశాల్లో చదివించాం. సిద్ధార్థ విద్య సంస్థల ఆధ్వర్యంలో దాదాపు 700 మంది విద్యార్థులకు రూ.65 లక్షలు స్కాలర్ షిప్స్ అందించం అభినందనీయం. ఇప్పటి వరకు 19 వేల మందికి స్కాలర్ షిప్స్ అందించాలంటే ఎంతో గొప్ప మనసు ఉంటేనే సాకారమవుతుంది. ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలంటే ప్రజలపై ప్రేమ, సమాజంపై బాధ్యత ఉన్నప్పుడే సాధ్యమవుతాయని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.

# ప్రపంచ అరుదైన వ్యాధుల దినోత్సవం - 2025

## ఇండియన్ ఆర్గనైజేషన్ ఫర్ రేర్ డిసీజెస్ ఆధ్వర్యంలో ప్రపంచ అరుదైన వ్యాధుల దినోత్సవం సందర్భంగా అవగాహన కోసం సదస్సు








**విజయవాడ, మేజర్ న్యూస్ :** లాభాపేక్ష లేని సంస్థ ఇండియన్ ఆర్గనైజేషన్ ఫర్ రేర్ డిసీజెస్ (ఐఓఆర్డీ), ప్రపంచ అరుదైన వ్యాధుల దినోత్సవం 2025 సందర్భంగా ప్రజా జ్ఞానాన్ని ప్రోత్సహించడం, వ్యాధి నిర్ధారణ, వ్యాధి చికిత్స, సామాజిక సేవ" అనే ప్రధాన విషయాల అవగాహన సదస్సును ఓ హోటల్ లో విజయవాడలో నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సేవా నిపుణులు, పాలసీ రూపకర్తలు, అరుదైన వ్యాధి కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 300 మిలియన్ల మంది, భారతదేశంలో 9 కోట్ల మందికి పైగా అరుదైన వ్యాధి బాధపడుతున్నవారి సవాళ్లను పరిష్కరించడానికి వ్యవస్థాగత జోక్యాల అవసరాన్ని ఇది నొక్కి చెప్పింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆంధ్రప్రదేశ్ లో సమగ్ర ఆరోగ్య వ్యవస్థను నిర్మించడానికి ఐవోఆర్డీ ప్రతిపాదనలను మూల్యాంకనం చేస్తున్నామని తెలిపారు. ఇండియన్ ఆర్గనైజేషన్ ఫర్ రేర్ డిసీజెస్ అధ్యక్షుడు డాక్టర్ రామయ్య ముత్యాల అన్నారు.

అరుదైన రోగాల సంరక్షణలో ఆంధ్రప్రదేశ్ భారతదేశానికి నాయకత్వం వహించగలదు. ఈ చర్యలు ప్రాధాన్యత పొందితే జీవితాలను కాపాడుతుంది, జాతీయ ప్రమాణాన్ని నిర్దేశిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వినోద్ కె. పాల్, మాజీ-ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ జి. సామారం, రోగుల సంఘాల నుండి వైద్య నిపుణులు ఇచ్చిన అంతర్దృష్టులను కూడా ప్రదర్శించారు. మరింత సమాచారానికి 9963980259 / 998531006 సంప్రదించవచ్చునని తెలిపారు.

# అమరుల త్యాగం వృధా కాదు..



**గన్నవరం, మార్చి 1, మేజర్ న్యూస్ :** గన్నవరంలో నిర్వహించిన మాదిగ అమర వీరుల దినోత్సవం. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో గన్నవరంలోని తాలూకా సెంటర్ లోని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం ఎదుట మాదిగ అమరవీరుల దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ మున్నంగి నాగరాజు మాదిగ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధించిన రోజు మాత్రమే మాదిగ అమరవీరులకు నిజమైన నివాళులు అర్పించినట్లు పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ లక్ష్యం కోసం ఎంతోమంది మాదిగలు తమ విలువైన ప్రాణాలను అర్పించారని వారి త్యాగాలు వృధా కానీయరాదని తెలిపారు. ఈ సందర్భంగా మార్చి 1 న ప్రతి ఏటా రెండు తెలుగు రాష్ట్రాల్లో మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తూ ఉంటామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు సుప్రీంకోర్టు నిర్ణయం మేరకు ఎస్సీ వర్గీకరణ త్వరలోనే చేస్తారనే విశ్వాసం మాదిగ జాతికి ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణ పై విద్యా, ఉద్యోగ, రాజకీయ, సంక్షేమ రంగాల్లో అధ్యాయనానికి నియమించిన ఏక సభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా తన నివేదికను వెంటనే రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించాలని కోరారు. వర్గీకరణ అమలయ్యేంత వరకు ఎలాంటి ఉద్యోగ భర్తీల నోటిఫికేషన్లు విడుదల చేయరాదని పేర్కొన్నారు. అలాగే ఉద్యోగస్తులకు ప్రమోషన్లో రిజర్వేషన్లు వర్గీకరణ అయ్యేంతవరకు నిలుపుదల చేయాలని కోరారు. సుప్రీంకోర్టులో వర్గీకరణపై విచారణ జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ లాయర్ ను నియమించకుండా నమ్మించి మోసం చేసిన జగన్మోహన్ రెడ్డికి మాదిగలు తగిన బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. గతంలో వర్గీకరణ చేసింది చంద్రబాబు నాయుడు మరల చేయబోయేది కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రమేనని తెలిపారు. అందుకు మాదిగ జాతి చంద్రబాబు నాయుడుకు ఎప్పటికి రుణపడి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గన్నవరం నియోజకవర్గ ఎంఎస్పి ఇన్చార్జి మంద వేణు మాదిగ ఎంఈఎఫ్ రాష్ట్ర కార్యనిర్వహణ అధికారి దేవరపల్లి విక్టర్ బాబు ఎంఆర్పిఎస్ గంగవరం మండల ఇంచార్జ్ కోటా కృష్ణమోహన్ మాదిగ బేడ బుడగ జంగాల రాష్ట్ర నాయకులు నాగేశ్వరరావు ఎం ఈ ఎఫ్ నాయకులు నల్లమోతు రమేష్ కొడాలి వరప్రసాద్ దేవరపల్లి రాబర్ట్ జాన్సన్ పీహెచ్పీఎస్ నాయకులు పచ్చికళ్ళ భాస్కర్ ఎమ్మార్పీఎస్ నాయకులు ఇందుపల్లి చక్రయ మాదిగ కొక్కిలిగడ్డ కమల్రాజు మాదిగ కొవ్వూరి రాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు

### ఎస్సై గణేష్ కుమార్

**బంటుమిల్లి మేజర్ న్యూస్:** డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్సై గణేష్ కుమార్ హెచ్చరించారు. శనివారం స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లో పలు వాహనాలను తనిఖీలు చేసి సరైన పత్రాలు లేనివారికి జరిమానాలు విధించారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు కచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. ఆర్ సి, పొల్యూషన్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్ తదితర పత్రాలు లేని వ్యక్తులకు జరిమానాలు విధించారు. నిత్య రద్దీగా ఉండే స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లో ట్రాఫిక్ ను నియంత్రించారు.

# బడ్జెట్లో చేనేతకు చిన్న చూపు



**పెడన, మేజర్ న్యూస్ :** రాష్ట్ర బడ్జెట్లో చేనేతకు తీవ్ర అన్యాయం జరిగిందని, చేనేతను ఈ కూటమి ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కట్ట హేమ సుందర్ రావు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ చేనేత పరిశ్రమపై లక్షలాదిమంది ఆధారపడి జీవిస్తున్నారని,దాదాపుగా లక్ష మగ్గాలు పైగా కలిగి ఉండి ఐదు లక్షల పైగా కుటుంబాలు పరిశ్రమపై ఆధారపడి ఉంటే అటువంటి చేనేతకు కేవలం115.70 కోట్లు మాత్రమే కేటాయించడం బాధాకరం అన్నారు. వ్యవసాయం తర్వాత అతి ఎక్కువ మందికి ఉపాధి చూపించే పరిశ్రమగా చేనేత పరిశ్రమ ఉందని అన్నారు.అది కాక ఇందులో థ్రిఫ్ట్ ఫండ్‌కి 5 కోట్లు మాత్రమే చేనేత సహకార సంఘ సభ్యులకు మాత్రమే ఉపయోగపడుతుంది. ఎన్ సి డి సి కి 5 కోట్లు యూనిటీ మాల్ 66 కోట్లు కేటాయించడం చేనేత కార్మికుల దగ్గరకు వెళ్లదు అని చెబుతూ,ఇందులో కేవలం ఐదు కోట్లు మాత్రమే చేనేత కార్మికులకు లబ్ది కలుగుతుంది అని పేర్కొన్నారు. మిగిలిన 110 కోట్లు అలంకారప్రాయంగా ఉందని, గత ఎనిమిది సంవత్సరాలుగా సహకార సంఘాలకు ప్రభుత్వం నుండి రావలసిన బకాయిలు యారన్ సబ్సిడీ, పావలా వడ్డీ, రిబేటు, థ్రిఫ్ట్ ఫండ్,, మార్కెట్ ఇన్సెంటు బకాయి చెల్లించే ఊసే బడ్జెట్లో కనిపించలేదు అని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వాగ్దానాలు చేయడంలో ఆరితేరిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతన్న నేస్తం కంటే మెరుగైన పథకాలను అందిస్తామని చెప్పి బడ్జెట్లో ఆ ఊసే లేదన్నారు.

అంతేగాక చేనేత వస్త్రాలపై జీఎస్టి పరిశ్రమనే కొంగ తీసింది అని మాట్లాడుతూ రియంబర్స్మెంట్ అమలు చేస్తున్నామని నమ్మబలికి బడ్జెట్లో ఆ మాటే ప్రస్తావన లేకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని బడ్జెట్ పై చర్చించేందుకు కర్నూలు జిల్లా కోడుమూరులో చేనేత కార్మిక సంఘం విస్తృత సమావేశం మార్చి 9వ తేదీకు కార్యక్రమం రూపొందించుకునేందుకు సమావేశం అవుతున్నట్లు తెలియజేశారు.

## ప్రధానోపాధ్యాయులకు గౌరవ డాక్టర్ రేట్‌లు ప్రధానం



**విజయవాడ మేజర్ న్యూస్ :** నగరంలో ఆంధ్రప్రదేశ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన క్రియేటివ్ మైండ్స్ ఒలంపియా ఫోరం (సి.యం.ఒ.ఎఫ్) సంస్థ చైర్మన్ ఆజామ్ సయ్యద్, జిల్లా ఫ్రాంచైజ్ యం.రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం నిర్మల హై స్కూల్ ప్రిన్సిపాల్ జి.బి ఆందోని, హిందీ టీచర్ దాసరి వెంకటవిమల, అటకిన్-సన్ ప్రిన్సిపల్ పుట్టి రజితలకు షిషా-ఆల్-హింద్ హాస్పటల్ గుంటూరు అధినేత అమానుల్లా ఖాన్ పఠాన్ ముఖ్యఅతిథిగా హాజరై వీరికి గౌరవ డాక్టరేట్, మెమొంటో బహుకరించినట్లు ఓ ప్రకటనలో నిర్మల హై స్కూల్ యాజయాన్యం తెలిపారు. సిఎంఓఎఫ్ సేవా కార్యక్రమాల వివరాల వెబ్సైట్ ను చైర్మన్ ఆజామ్ సయ్యద్ ఆవిష్కరించినట్లు పేర్కొన్నారు.

## మాతృ భాషాభివృద్ధికి రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా బడ్జెట్లో నిధులు కేటాయించడం హర్షణీయం

**విజయవాడ మేజర్ న్యూస్ :** తెలుగు భాషాభివృద్ధికి, తెలుగు భాష పరిరక్షణకు ఉమ్మడి రాష్ట్ర చరిత్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా బడ్జెట్లో 10కోట్ల రూపాయలు కేటాయించడం హర్షణీయమని ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి తొలితెలుగు దివ్వె తెలుగు మూలాల అధ్యయన సంఘం భారత్ అధ్యక్షులు, నగర మాజీ కార్పొరేటర్ పిల్లి లక్ష్మీతులసి శనివారం ఓ ప్రకటనలో ధన్యవాదాలు తెలియజేశారు. అంతేకాకుండా ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ ను బడ్జెట్లో ప్రకటించడం కూడా రాష్ట్ర చరిత్రలో తొలిసారి అని ఆమె పేర్కొన్నారు. 1500 సంవత్సరాల క్రితమే క్రీ.శ. 575 సం॥లో తెలుగు భాషకు సంపూర్ణ అక్షర రూపం కల్పించి తొలిగా వాక్య నిర్మాణం చేసి వ్రాతలేని తెలుగులో రచన ప్రారంభించి తొలిగా తెలుగు భాషను రాజభాషగా చేసి తొలి తెలుగు శాసనం చెక్కించిన ఎరి(కల్) ముత్తురాజు ధనంజయుడి విగ్రహాన్ని శాసనసభా ప్రాంగణంలో ప్రతిష్టించాలని, ఉన్నత విద్యా పాఠ్యాంశంలో తెలుగు భాషకు ఆద్యులైన రేనాటి చోళరాజుల చరిత్రను ప్రచురణ చేయించాలని ప్రభుత్వాన్ని కోరినట్లు ఆమె తెలియజేశారు.

## ఐకాన్ కంటి హాస్పిటల్‌లో ఉచిత కంటి పరీక్షలు

**నందిగామ, మార్చి 1, మేజర్ న్యూస్:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 1 వ తేదీ అనగా శనివారం నుంచి మార్చి 15 వ తేదీ శనివారం అనగా 15 రోజులుఐకాన్ కంటి ఆసుపత్రి వారు మహిళలందరికీ ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇన్సూరెన్సు(నగదు రహిత) సేవల ద్వారా కంటి ఫాకో లేసర్ ఆపరేషన్స్, ఇంపోర్టెడ్ (ఫారన్ లెన్స్) పొందండి అన్నారు.ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ, ఈ హెచ్ ఎఫ్ ద్వారా ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించబడును అన్నారు. నందిగామలో జాతీయ ఉత్తమ ప్రమాణాలు కలిగిన హాస్పిటల్ గా గుర్తింపు పొందిన మొట్ట మొదటి హాస్పిటల్ ఐకాన్ కంటి ఆసుపత్రి.అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల సేవలను గౌరవిస్తూ మార్చి నెల 1 నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఉచిత కంటి పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మరిన్ని వివరాలకు ఐకాన్ కంటి ఆసుపత్రి, చైతన్య కాలేజ్ ఎదురుగా, విజయవాడ హైవే రోడ్,లో 08678 293999, 8367 293999 సంప్రదించవలసిందిగా తెలిపారు.

## గుడివాడ శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో సైన్స్ సంబరాలు



**గుడివాడ, మేజర్ న్యూస్ :** పట్టణం రాజేంద్రనగర్ లోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో సైన్స్ డే ఘనంగా నిర్వహించారు. ఎంఈవో బాలాజీ ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులు చేసిన సైన్సు ప్రాజెక్టను వీక్షించి వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా పిల్లలు భవిష్య త్తులో సైంటిష్టలుగా ఎదిగి దేశ భవిష్యత్తును అభివృద్ధి పథంలో నడుపుతారన్నారు. ప్రిన్సిపల్ విజయ్ భాస్కర్ మాట్లాడుతూ సైన్స్ రంగం పట్ల ఆశక్తి పెంచుకోవాలని భవిష్యత్తులో ఉన్నత పౌరులుగా సమాజానికి, దేశానికి సేవలు అందిస్తూ తల్లిదండ్రులకు కీర్తిప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈజీఎం మురళీ కృష్ణ ఆర్.ఐ.దీరేంద్ర, అకాడమిక్ కోఆర్డినే టర్ అశోక్, పాఠశాల డీన్ త్రినాథ్ పాల్గొని విద్యార్థులను అభినందించారు.

**డాక్యుమెంట్స్ పోయినవి**

పెనుగంచిప్రోలు మండలం గుమ్మడిదూరు (వెల్దుర్తిపాడు) గ్రామానికి చెందిన మల్లారపు వేలాద్రి తండ్రి గోపాలరావు కు సంబంధించిన 5105/2021, 5106/221 రెండు డాక్యుమెంట్లు పెనుగంచిప్రోలు ఎండిఓ కార్యాలయానికి వెళుతున్న సమయంలో పోయినవి దొరికిన వారు క్రింది నెంబర్‌కు సమాచారం ఇవ్వగలరు.

మల్లారపు వేలాద్రి
సెల్ : 939256822

## క్రీడా సామాగ్రికి పూర్వవిద్యార్థులు వితరణ



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** చల్లపల్లి రాజా హైస్కూల్ విద్యార్థులు సౌకర్యార్థం 1984 – 85 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు క్రీడాసామాగ్రిని వితరణగా అందచేశారు. రూ.12వేల విలువైన వాలీ బాల్, త్రోబాల్, టెన్నికాయిట్, షటిల్ బ్యాట్స్ తదితర క్రీడా సామాగ్రిని హెచ్ఎం ఎస్. సుదర్శన ధర ప్రసాద్, పీఈటీ జి.శ్రీనివాస్ కు శనివారం హైస్కూల్లో అందచేశారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు కొల్లిపర నరేంద్ర, కంతేటి చంద్రశేఖర్, ఉడత్తు వెంకటేశ్వరరావు, వెంట్రప్రగడ రమేష్, రావులపల్లి విఘ్నేశ్వరరావుషేక్ నబీఘోరి, ఉపాధ్యాయలు రాజు, రేణుప్రసాద్, మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. చదువుకున్న పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న పూర్వవిద్యార్థులను విద్యాకుటుంబం అభినందించారు.

## హెల్మెట్ లేకుంటే రూ.1000 జరిమానా



**నందిగామ, మార్చి 1, మేజర్ న్యూస్ :** డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపితే నేటి నుండి పెరిగిన జరిమానాలు చెల్లించాల్సి ఉంటుందని నందిగామ ట్రాఫిక్ ఎస్సై నరేష్. ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 1వ తేదీ నుండి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హెల్మెట్ లేకుండా నడిపితే రూ.1000 జరిమానాతో పాటు మూడు నెలలు లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నడిపితే రూ.5000, ట్రిపుల్ డ్రైవింగ్ చేస్తే రూ.1000, ప్రమాదక రమైన డ్రైవింగ్ కు మొదటి సారి రూ.1500, రెండవ 10000 జరిమానా విధిస్తామని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు కొత్త జరిమానా విధానాలు తెలుసుకుని ఆదేశాలను పాటించాలని కోరారు.

## తాగునీటి స్కీములను మున్సిపల్ చైర్మన్ పరిశీలన



**నందిగామ, మార్చి 1, మేజర్ న్యూస్ :** రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని నందిగామ నగరపాలక సంస్థలో మంచినీటికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా తగు చర్యలు తీసుకోవాలి అని నందిగామ మున్సి పల్ చైర్మన్ మండవ కృష్ణకుమారి అన్నారు. ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆదేశాల మేరకు కీసర పంపింగ్ స్కీము, నందిగామలోని ట్యాంకులను మండవ కృష్ణ కుమారి సందర్శిం చారు. పంపింగ్ స్కీం వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన రెండు మోటార్లకు సంబంధించిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ప్రస్తుతం ఎదుర్కొం టున్న తాగునీటి సమస్యను త్వరితిగతిన పరిష్కరించాలని రానున్న వేసవికా లంలో మంచినీటికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా తగు జాగ్రత్తలు తీసు కోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ కమిషనర్ జే ఫణి శ్రీనివాస్ టిడిపి నాయకులు కాసర్ల లక్ష్మీనారాయణ, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## గాలికుంటు, బ్రూసెల్లోసిస్ వ్యాధుల నివారణకు ఆవులు, గేదెలకు టీకాలు



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గాలికుంటు, బ్రుసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని మండలంలో ప్రారంభించినట్లు వైద్య అధికారిణి వి.సీ.వీణ తెలిపారు. రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఆవులు, గేదెలు, దూడలలో గాలికుంటు వ్యాధి, బృసెల్లోసిస్ వ్యాధుల నివారణకు టీకాల నిర్వహణ మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం నుండి ప్రారంభించినట్లు తెలిపారు. ఈనెల 1వ తేదీ నుండి 31వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు, 4 నెలల దూడ నుంచి పెయ్య దూడ, దున్న పిల్ల అనే తేడా లేకుండా పాడి గేదెలు ఆవులు అన్నింటికీ గాలికుంటు వ్యాధి టీకాలు వేయించుకోవాలని పాడి రైతులకు తెలిపారు. అలాగే 4-8 వయసు గల పెయ్య దూడలకు కూడా బృసల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు కూడా వేయించుకుంటే మంచిదని డాక్టర్ వీణ వివరించారు.

# 7న శ్రీవారి కల్యాణ మండపం ప్రారంభోత్సవం



### భక్తులకు అన్ని వసతులు కల్పించాం ఆహ్వాన కమిటీ

**ఏ.కొండూరు, మార్చి1, మేజర్ న్యూస్:** ఖమ్మం జిల్లా, ఎర్రుపాలెం మండలం, జమలాపురం దివ్య క్షేత్రం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం సన్నిధిలో నూతనంగా నిర్మించిన శ్రీ వకుల మాత స్టేడియం శ్రీవారి కళ్యాణ మండపం శిఖర ప్రతిష్ట, ప్రారంభోత్సవం ఈ నెల 7వ తేదీన ప్రారంభిస్తున్నట్లు ఆహ్వాన కమిటీ తెలిపారు. జమలాపురం గ్రామ వాస్తవ్యులు ప్రముఖ వ్యాపార వేత్త కేఎన్ఆర్ గ్రానైట్స్ అధినేత తుళ్లూరు కోటేశ్వరరావు నిర్మల కుమారి దంపతులు స్వామివారిపై అత్యంత భక్తి శ్రద్ధలతో భక్తులు శ్రీవారి కళ్యాణ ఉత్సవం తిలకించుటకు అత్యంత సౌకర్యవంతంగా అనుకూలంగా ఉండటానికి సొంత నిధులతో అంగరంగ వైభవంగా నిర్మించిన శ్రీ వకుల మాత స్టేడియం అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక కళ్యాణ మండపం శిఖర ప్రతిష్ట, ప్రారంభోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా దాత తుళ్లూరు కోటేశ్వరరావు మాట్లాడుతూ శ్రీవారి కళ్యాణ మండపం ప్రారంభోత్సవానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి విచ్చేస్తున్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు పడకుండా అన్ని రకాల వసతులు కల్పించామన్నారు. శ్రీవారి శాంతి కళ్యాణ ఉత్సవమునకు విచ్చేస్తున్న భక్తులందరికీ మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుండి శాంతి కళ్యాణ మహోత్సవం తిరుమల తిరుపతి దేవస్థానం వేద పండితుల ఆధ్వర్యంలో వేద మంత్రములు, మంగళ వాయిద్యముల నడుమ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నన్నపనేని రామారావు, ఆర్గనైజేషన్ అధ్యక్షులుఎల్వి నారాయణరెడ్డి, వేజెండ్ల సాయికుమార్, వాసిరెడ్డి వెంకటాద్రి పలువురు పాల్గొన్నారు.

# అభివృద్ధికి బడ్జెట్లో కేటాయింపుల పట్ల హర్షం



**నందిగామ, మార్చి 1, మేజర్ న్యూస్:** నియోజవర్గ పార్టీ కార్యాలయం నుండి విలేకరులతో వీరంకి వీరాస్వామిన్ శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ పై మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలలో తల్లికి వందనం పథకం కింద ఎంత మంది పిల్లలు ఉన్నా ప్రతి ఒక్కరికి 15000 రూపాయలు సంవత్సరానికి బడ్జెట్లో కేటాయించడం, అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకి 20,000 ఇవ్వటానికి 9400 కోట్లు కేటాయించడం, సంవత్సరానికి ఉచిత గ్యాస్ సిలిండర్లు మూడు 2వేల600 కోట్లు కేటాయించడం, ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద 27,518 కోట్లు కేటాయించడం,, వెనకబడిన వర్గాలకు సముచిత స్థానం ఇస్తూ బిసిల అభివృద్ధికి 47,456 కోట్లు, మైనార్టీలకు 5434 కోట్లు, ఎస్సీలకు 15 వేల కోట్లు, ఎస్టీలకు 8,159 కోట్లు బడ్జెట్లో నిధులు కేటాయించడం, నీటిపారుదల రంగానికి, విద్యా, వైద్యా రంగాలకు అధిక నిధులు కేటాయించడంపై రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతుందనీ పేద, బడుగు, బలహీన వర్గాల ప్రభుత్వం అని రుజువు అయిందని నందిగామ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు వీరంకి వీరాస్వామిన్ హర్షం సంతోషం ఆనందం వ్యక్తం చేశారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను అన్నింటిని ప్రభుత్వం ఏర్పడిన 9 నెలల లోపే మాట నిలబెట్టుకున్న ఘనత కూటమి ప్రభుత్వం కే దక్కుతుందని వీరాస్వామిన్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని వర్గాల ప్రజలు నిన్న ప్రవేశపెట్టిన బడ్జెట్ పై హర్షం వ్యక్తం చేస్తున్నారని వీరాస్వామిన్ అన్నారు. ఈ సందర్భంగా జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, జనసేన అధినేత ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి, యువనేత మంత్రి నారా లోకేష్ బాబుకి బిజెపి నాయకులకు వీరాస్వామిన్ కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు.

# సేవా కార్యక్రమాల్లో రంగన్నగూడెం కృష్ణాజిల్లాకే ఆదర్శం





**హనుమాన్ జంక్షన్, మార్చి 1, మేజర్ న్యూస్ :** బాపులపాడు మండలం, రంగన్నగూడెం గ్రామంలోని గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో జరుగుతున్న సేవా కార్యక్రమాలు కృష్ణాజిల్లాకే ఆదర్శమని లయన్స్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి పేర్కొన్నారు. శనివారం ఉదయం రంగన్నగూడెం గ్రామంలో తన అధికార పర్యటనలో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమాన్ జంక్షన్ గ్రామ ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 8వ తరగతిలో మెరిట్ విద్యార్థులైన మండపాటి పూర్ణజ్యోతి, దారం కమిలిని లకు ఆళ్ళ సావిత్రమ్మ మెమోరియల్ మెరిట్ స్కాలర్ షిప్ క్రింద ఒక్కో విద్యార్థికి రు.10,000లు నగదు రూపేణా లయన్స్ గవర్నర్ గద్దె శేషగిరి చేతులమీదుగా అందజేశారు. గ్రామానికి చెందిన ఎన్.ఆర్.ఐ ఆళ్ళ సౌమ్య సౌజన్యంతో 100 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పలకలు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి మాట్లాడుతూ రంగన్నగూడెం గ్రామంలో సీనియర్ లయన్స్ సభ్యులు, గ్రామ ప్రముఖులు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు ఆధ్వర్యంలో రంగన్నగూడెం రూరల్ డెవలప్మెంట్ సొసైటీ తరఫున మినరల్ వాటర్ ప్లాంటును ఎన్.ఆర్.ఐ ల సహకారంతో నిర్వహిస్తూ అత్యాధునిక సౌకర్యాలతో ఎనీటైమ్ వాటర్ (ఎ.టి.డబ్ల్యు) ద్వారా లబ్దిదారులకు కార్డు ఇచ్చి 20 లీటర్లు మంచినీరు కేవలం రు.5 లకే గ్రామస్థులకు అందుబాటులోకి తేవటం చాలా మంచి విషయమన్నారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ ప్రముఖులు లయన్స్ జిల్లా అదనపు కేబినెట్ కార్యదర్శి ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ గ్రామంలోని ఎన్.ఆర్.ఐ లు ఇతర రాష్ట్రాల్లో స్థిరపడ్డ ప్రముఖుల సహకారంతో రంగన్నగూడెం రూరల్ డెవలప్మెంట్ సొసైటీ తరఫున ప్రతి సంవత్సరం మెరిట్ విద్యార్థులకు స్కాలర్షిప్ ల పంపిణీ, ఉచిత వైద్య శిబిరాలు, గ్రామంలో యువతకు శిక్షణ, ప్రాథమికోన్నత పాఠశాలలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అట్లాగే గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం క్యాష్ కౌంటర్, లాకర్, గోడౌన్, పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న సేకరణ కౌంటర్, గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో జరుగుతున్న స్వచ్ఛతా కార్యక్రమాలను పరిశీలించి వాటి నిర్వహణపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయంలో జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి, జిల్లా క్యాబినెట్ కార్యదర్శి ముత్యాల రామారావు, లయన్స్ గాట్ వైస్ చైర్మన్ చెన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎం.పి.టి.సి సభ్యులు పుసులూరి లక్ష్మినారాయణ, ఎం.పి.సి.ఎస్ అధ్యక్షులు మొవ్వా శ్రీనివాసరావు, ఎస్.ఎం.సి చైర్మన్ నత్తా అబ్రహాం, పి.ఎ.సి.ఎస్ మాజీ అధ్యక్షులు తుమ్మల దశరథరామయ్య, జిల్లా లయన్స్ నాయకులు ఎస్.వి.ఎస్.ఎస్. ప్రసాద్, వేములపల్లి శ్రీనివాస్, ఆర్. వెంకటేశ్వరరెడ్డి, సి.జాన్ బాబు, హనుమాన్ జంక్షన్ లయన్స్ క్లబ్ సీనియర్ నాయకులు నందిగం వెంకటేశ్వరరావు, అక్కినేని శ్రీనివాస్ ఫణీంద్ర, చలసాని వెంకటేశ్వరరావు, కలపాల రంగారావు, స్కూల్ హెచ్.ఎం ఆర్.గ్లోరి స్వర్ణలత, గ్రామ ప్రముఖులు కసుకుర్తి అర్జునరావు, ఆళ్ళ నరశింహారావు, ఆళ్ళ గురవయ్య, మందపాటి రాంబాబు, కనకవల్లి శేషగిరిరావు, తుమ్మల వెంకటేశ్వరరావు, కాట్రు పాపారావు, కొలుసు గంగాజలం, తమిరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రవీంద్ర భారతిలో అబ్బురపరిచిన విజ్ఞాన శాస్త్ర పదర్శన







**విజయవాడ :** రవీంద్ర భారతి పబ్లిక్ స్కూల్ బాలాజీ నగర్ లో శనివారం విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనను అబ్బురపరిచింది. ఈ ప్రదర్శనకు ముఖ్య అతిధులుగా చైర్మన్ వీరమాచనేని వంశీ కృష్ణ, వీరమాచనేని శాంతి పాల్గొన్నారు. విజ్ఞాన



శాస్త్ర ప్రదర్శన అనగా సాధారణంగా పోటీ దారులు వారు సృష్టించిన విజ్ఞాన శాస్త్ర ప్రాజెక్ట్ల నివేదికను నమూనా రూపంలో ప్రదర్శించే ఒక పోటీ, ఈ ప్రదర్శన విద్యార్థులు సంవత్సరమంతా నేర్చుకున్న విద్యను ప్రదర్శించడానికి అవకాశం కల్పించే ఒక వేదిక. ఇది విద్యార్థులలో ప్రేరణ కల్పిస్తుంది. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రగతి ని తెలుసుకొనే పరిపుష్టిగా ఉంటుంది. అనేక నమునాల ప్రదర్శనను చూసిన విద్యార్థులకు తాము కూడా ఇలాంటి ప్రదర్శనలో భాగస్వాములు కావాలన్న భావన కలుగుతుంది. ఈ ప్రదర్శనలో భాగంగా ప్రధానోపాధ్యాయుని కె.ఎస్.ఎన్. జ్యోతి, అకాడమిక్ ఆఫీసర్ ఆర్.అపర్నిక పాల్గొన్నారు. ఈ ప్రదర్శనకు డాక్టరీ కె.జయలక్ష్మి అతిధిగా విచ్చేశారు. ఈ ప్రదర్శనలో భాగంగా వృక్షోః రక్షితిః రక్షితః (ఏ.లక్కి, ఎన్.ఎస్.కె. తహ్సిన్) భారత రాజ్యాంగం (ఆర్.అరుణ రెడ్డి) సేవ్ ది ఎర్త్ (వి.మోహిత్ కార్తిక్), ఎయిర్ పొల్యూషన్ (బి.అఖిల్), తదితర ప్రాజెక్టులు ఆకర్షణీయం నిలిచాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేసారు.

# నారాయణ ఇ.ఎం. స్కూల్లో విజయవంతంగా సైన్స్ ఎక్స్ పో





**విజయవాడ, మేజర్ న్యూస్ :** పటమట హై స్కూల్ రోడ్ నారాయణ ఇ.ఎం. స్కూల్లో విజయవంతంగా సైన్స్ ఎక్స్ పో జరిగింది. ఈ ఎక్స్ పోకు ముఖ్య అతిధిగా ఏజీఎం మురళీ కిషోర్ మాట్లాడుతూ జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని దేశంలో ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న జరుపుకుంటున్నామన్నారు. రామన్ ఎఫెక్ట్ లను కనిపెట్టిన చంద్రశేఖర వెంకట రామన్ తన పరిశోధనా ఫలితాన్ని ధ్రువీకరించిన రోజుని నేషనల్ సైన్స్ డేగా జరుపుకుంటున్నామన్నారు. విద్యార్థి దశ నుంచి సైన్స్ పై ఆసక్తి కలిగించడం శాస్త్ర సాంకేతిక అభివృద్ధి భారతీయుల కృషి తెలియజేసే ఉద్దేశమే ఈ సైన్స్ ఎక్స్ పో అన్నారు. ఈ సైన్స్ ఎక్స్ పోలో మైక్రోస్కోప్, గ్లోబల్ వార్మింగ్, మానవ శ్వాసకోశ వ్యవస్థ, వర్షపు నీటి సేకరణ, బజర్ గేమ్, పగలు - రాత్రి, చంద్రయాన్ 3, ఆబ్జెక్ట్ డిటెక్టింగ్ సెన్సార్, హైడ్రాలిక్ బ్రిడ్జి, వ్యర్థ జల శుద్ధి, స్మార్ట్ సిటీ, పార్లమెంట్ హౌస్ ఆఫ్ ఇండియా ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు.

ఈ ప్రదర్శనలో క్లస్టర్ ప్రిన్సిపాల్ రాజశేఖర్, ఈ చాంప్స్ కోఆర్డినేటర్ జహూర్ ఫాతిమా ఖాన్, హైస్కూల్ కో ఆర్డినేటర్ ముత్తా రెడ్డి, ప్రిన్సిపాల్ శామ్యూల్ రాజు, వైస్ ప్రిన్సిపాల్లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఆటో కొనుగోలుకు గద్దె క్రాంతికుమార్ ఆర్థిక సహాయం



**విజయవాడ తూర్పు, మేజర్ న్యూస్ :** సమాజ సేవ, తోటివారికి సహాయం చేసే గుణాన్ని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చూసి తామంతా నేర్చుకున్నామని తెలుగుదేశం పార్టీ యువత విభాగం నాయకుడు గద్దె క్రాంతికుమార్ పేర్కొన్నారు. శనివారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని రామలింగేశ్వనగర్కు చెందిన నడికట్ల కృష్ణమోహన్కు ఆటో కొనుగోలు నిమిత్తం డౌన్పేమెంట్గా రూ.35 వేలను తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ కుమారుడు గద్దె క్రాంతి కుమార్ పటమటలోని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయంలో అందచేశారు. ఈ సందర్భంగా గద్దె క్రాంతికుమార్ మాట్లాడుతూ కృష్ణమోహన్ దంపతులు గత వారం ఎమ్మెల్యే గద్దె రామమోహన్ను కలిసి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నామని, ఆటో నడుపుతూ ఆటో అద్దె, ఇంటి అద్దె కడుతూ కుటుంబ జీవనోపాధి, పిల్లల స్కూల్ ఫీజు చెల్లించుకోవడం కష్టంగా ఉందని వారి ఆవేదనను తెలియజేశారన్నారు. ఎమ్మెల్యే గద్దె రామమోహన్ వెంటనే స్పందించి లోనుపై కొత్త ఆటో కొనుగోలుకు అవసరమైన డౌన్పేమెంట్ను గద్దె ఫౌండేషన్ ద్వారా అందజేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. ఎమ్మెల్యే గద్దె రామమోహన్ ఇచ్చిన హామీ మేరకు గద్దె ఫౌండేషన్ ద్వారా రూ.35 వేల చెక్కును వరుణ్ మోటార్స్ కంపెనీ పేరుతో కృష్ణమోహన్ దంపతులకు అందచేశామని గద్దె క్రాంతికుమార్ చెప్పారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందచేయడమే కాకుండా తన వ్యక్తిగత నిధుల నుంచి నియోజకవర్గంలోని పేదలకు సహాయం చేస్తున్నారని చెప్పారు. సమాజ సేవ, తోటివారికి సహాయం చేసే గుణాన్ని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ నుంచి తామంతా నేర్చుకుంటున్నామని అన్నారు. కృష్ణమోహన్ దంపతులు మాట్లాడుతూ ఆటో నడుపుతూ జీవనోపాధి కష్టంగా మారిందని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ను గత వారం కలిసి విన్నవించామని, లోనుపై ఆటో కొనుగోలుకు డౌన్పేమెంట్ను తాను అందచేస్తానని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ హామీ ఇచ్చారని చెప్పారు. చెప్పినట్లుగానే వారం రోజుల లోపే ఎమ్మెల్యే గద్దె రామమోహన్ కుమారుడు గద్దె క్రాంతికుమార్ చేతుల మీదుగా రూ.35 వేలను అందుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చేసిన సహాయాన్ని తమ జీవితాంతం గుర్తించుకుంటామని కృష్ణమోహన్ దంపతులు అన్నారు. అడిగిన వెంటనే సహాయం చేసిన ఎమ్మెల్యే గద్దె రామమోహన్, గద్దె క్రాంతికుమార్ లకు కృష్ణమోహన్ దంపతులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమములో యనమద్ది శ్రీనివాస్, మెడబలిమి భార్గవ్, మోరంపూడి ధీరజ్, పి.వరుణ్ శ్రీసాయి, తుమ్మల వెంకట్, మాగంటి నితిన్, నిమ్మగడ్డ చిన్నా తదితరులు పాల్గొన్నారు.



## సామూహిక కుంకుమ పూజలు

**చల్లపల్లి, మేజర్ న్యూస్:** చల్లపల్లి గ్రామదేవత శ్రీసంపటాలమ్మ తల్లి అమ్మవారి ఆలయ 26వ వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. కుంకుమ పూజల్లో మహిళలు పెద్దఎత్తున పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పండితులు ఘంటసాల శతానందశాస్త్రి కుంకుమ పూజలు చేయించారు. ఆలయ అర్చకులు చల్లపల్లి కోటేశ్వరరావు దంపతులు అమ్మవారికి విశేష అలంకరణలు చేసి పూజలు చేశారు. ఆలయ కమిటీ పెద్దలు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆదివారం అమ్మవారి ఆలయ వార్షికోత్సవం, అన్నసమారాధన కార్యక్రమాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు చల్లపల్లి, మేజర్ న్యూస్ : ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. చల్లపల్లిలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేయగా, మొత్తం 704 మంది విద్యార్థినీ విద్యార్థులకు గాను 683 మంది పరీక్షలకు హాజరయ్యారు. విజయ జూనియర్ కళాశాలలో 342 మందికి గాను 13 మంది గైర్హాజరు కాగా, విజయ క్రాంతి జూనియర్ కళాశాలలో 362 మందికి గాను 8 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావులు పరీక్షలను పర్యవేక్షించారు.

## అత్యంత ఖరీదైన క్రీడగా గుర్తింపు పొందింది ఫెన్సింగ్

### ఏపీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**వీరులపాడు, మార్చి 1, మేజర్ న్యూస్ :** జుజ్జూరు రోడ్డులో శనివారం 11వ ఆంధ్రప్రదేశ్ ఇంటర్ డిస్టిక్ (యు-14) బాలురు బాలికల ఛాంపియన్షిప్ ను ఏకత్వ యాజమాన్యం, కూటమి నేతలు, ఆంధ్రప్రదేశ్ శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు తో కలిసి ప్రారంభించిన ఏపీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ 2019-24 గత పాలకుల పాలనలో క్రీడలకు గ్రహణం పట్టింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన అది కొద్ది కాలంలోనే క్రీడలను ప్రోత్సహిస్తూ క్రీడాకారుల భవిష్యత్తును ముందుకు తీసుకెళుతున్న ఏకైక రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు. అలనాటి పౌరాణికాల కాలం నాటి నుంచే ప్రసిద్ధిగాంచిన క్రీడ ఈ ఫెన్సింగ్ (కత్తి సాము) విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు కూడా చాలా ముఖ్యం. విద్యార్థుల మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదకరం. ఈ రోజు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఏకత్వ యాజమాన్యానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రవి నాయుడుకి ధన్యవాదాలు పిల్లలకు ఆశీస్సులు తెలిపారు.రవి నాయుడు మాట్లాడుతూ తండ్రి వారసత్వాన్ని పునపుచ్చుకున్న నాయకురాలు



అతి సౌమ్యులు ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య నేను శాప్ చైర్మన్గా ఎన్నికైన నాటి నుంచి నియోజకవర్గంలో క్రీడలను ప్రోత్సహించాలని దానికి అనువైన సౌకర్యాలను వాతావరణాన్ని కల్పించే దిశగా సహకరించాలని తాపత్రయపడే వ్యక్తి మన సౌమ్య అన్నారు.. క్రీడలకు సంబంధించి గత పాలకుల నిర్లక్ష్యంతో మరుగున పడిన పనులను వేగవంతం చేయడానికి కృషి చేస్తామన్నారు.



## డాక్టర్ సిఎల్ ఆధ్వర్యంలో పేదలకు ఉచిత కార్పొరేట్ వైద్యసేవలు



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సి.ఎల్ వెంకటరావు ఆధ్వర్యంలో గుడ్లవల్లేరులోని జన్మభూమి మెడికల్ సెంటరులో కార్పొరేట్ వైద్య సేవలతో కూడిన ఉచిత మెగా వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. ఏలూరు సెయింట్ జోసెఫ్ వైద్య కళాశాల వైద్యులు రోగులకు దంత వైద్య పరీక్షలు చేశారు. అలాగే విజయవాడ సివిఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు రోగులకు గుండె వైద్య పరీక్షలు చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వందలాది మంది రోగులు శిబిరంలో పాల్గొని కార్పొరేట్ వైద్యసేవలను ఉచితంగా పొందుకున్నారు. అనంతరం అవసరమైన రోగులకు వైద్య శిబిరంలో ఉచితంగా మందులు పంపిణీ చేసారు. అలాగే ఆదివారం విజయవాడ కామినేని హాస్పిటల్, హౌమియో వైద్యులు, ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు తమ వైద్య శిబిరంలో వైద్య సేవలు అందించనున్నారని, ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ సి ఎల్ వెంకటరావు పేర్కొన్నారు.

## హైస్కూల్ విద్యార్థినులకు గుడ్లవల్లేరు పోలీస్ ఓపెన్ హౌస్




**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా గుడ్లవల్లేరు పోలీసు స్టేషన్ లో ఎస్ఐ ఎన్ వి వి సత్యనారాయణ ఆధ్వర్యంలో హైస్కూల్ విద్యార్థినులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ విధులు, బాధ్యతలు, కర్తవ్య నిర్వహణ, రిసెప్షన్, రికార్డుల నిర్వహణ, డయల్ 112, 1930, మహిళా పోలీసులు నిర్వహించే హెల్ప్ డెస్క్, శక్తి టీమ్స్ లపై సంపూర్ణ అవగాహన విద్యార్థినులకు కలుగచేసారు. ఎస్ఐ సత్యనారాయణ పౌరులందరికీ, ప్రాముఖ్యంగా మహిళలు, విద్యార్థినీలు, యువతులు ఏదైనా సమస్య ఎదురైనప్పుడు పోలీసు స్టేషన్‌ను సమాచారం ఎలా అందించాలో, సేవలకొరకు ఎలా సంప్రదించాలో, అలాగే పోలీసు కేడర్స్, నిర్వర్తించే విధులు, కేసుల నమోదు చేయడం, రికార్డుల నిర్వహణ తదితరాలపై సంపూర్ణ అవగాహన చేసారు. ముఖ్యంగా చట్టంలో కల్పించబడిన రక్షణలు, వాటిని పొందుకోడానికి మహిళా డెస్కులు సహాయపడే, రక్షణగా నిలిచే విధానం, మద్ధతుగా నిలిచి మానసిక స్థైర్యాన్నిస్తూ, వైద్య, న్యాయ సహాయాలు పొందేందుకు తోడ్పడే తీరును వివరించారు. మహిళల, యువతుల రక్షణ కొరకు శక్తి టీమ్స్ నిరంతరం గస్తీ తిరుగుతూ సత్వరం స్పందించడం, సామాజిక రుగ్మతలు, వాటిపై అవగాహన కలుగచేస్తూ, రూపుమాపేందుకు కావలసిన తోడ్పాటు అందించే తీరులను సవివరంగా హైస్కూల్ విద్యార్థినులకు అవగాహనచేసారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, హైస్కూల్ విద్యార్థినీలు పాల్గొన్నారు.

## విద్యార్థులే జాతి రత్నాలు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** విద్యార్థు లేని సమాజానికి జాతి రత్నాల ని, రాబోయే తరంలో వారే దిక్సూచులు అని కృష్ణా జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ అన్నారు. తాళ్లపాలెం, కానూరు జిల్లా పరిషత్ పాఠశాలలో గత సంవత్సరం 7,8,9 తరగతులలో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థు లకు మానవతా స్వచ్ఛత సేవా సంస్థ ఆధ్వర్యంలో గోపు సత్యనారాయణ, కెమిస్ట్రీ కింగ్ డివిఆర్, బహుమతులను అందజేశారు. స్టార్ విద్యా సంస్థల డైరెక్టర్ బొమ్మి డి స్వామి, సీనియర్ పాత్రికేయులు శాస్త్రి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోపు సత్యనారాయణ విద్యార్థులకు చక్కని సలహాలు, సూ చనలు అందించారు. చిన్నప్పట్నుంచి క్రమశిక్షణ, పోటీతత్వం తో చదివితే గ్రామానికి కుటుంబానికి తద్వారా రాష్ట్రానికి మంచి పేరు ప్రఖ్యాతులను తేవడంతో పాటు మంచి జీవన విధానం సాగించవచ్చున్నారు. చక్కగా చదువుకోవాలనే ఉద్దేశం ఉన్న విద్యార్థులు తమ విద్య, వైద్య సాయం కోసం ఏ అవసరం వచ్చినా తనను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బీసీలు గర్వపడే విధంగా రాష్ట్ర బడ్జెట్

**రెడ్డిగూడెం, మేజర్ న్యూస్ :** 2025- 26 రాష్ట్ర బడ్జెట్ బీసీలకు పెద్ద పీట వేయటం బీసీలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు ఇచ్చిన మాటకు కట్టుబడి బీసీలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లే దిశగా రాష్ట్ర బడ్జెట్లో బీసీల కోసం 47456 కోట్లు కేటాయించడం ఎంతో ఆనందంగా ఉందని బొమ్మిన కోటేశ్వరరావు రాష్ట్ర కుమ్మర (శాలివాహన)సాధికారత కమిటీ మెంబర్, తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ నాయకులు అన్నారు. ఈ నిధులన్నీ సక్రమంగా బీసీలకు అందేలా చూడాలని అధికారుల్ని కోరారు బీసీలకు తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం అండదండగా ఉండటం ఎంతో ఆనందంగా, బీసీని అని చెప్పుకునేటందుకే గర్వకారణంగా ఉందని ఈ బడ్జెట్ ని కేటాయించిన కూటమి ప్రభుత్వానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# 'బెరాకా' సేవలు అనన్య సామాన్యం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** బెరాకా మినిస్ట్రీస్ సంస్థ ద్వారా డాక్టర్ బి ఎస్ కిరణ్ పాల్ చేస్తున్న సేవలు అనన్య సామాన్యమని, టిడిపి రాష్ట్ర సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. సేవా భావం అనే లక్షణాన్ని దైనందిన జీవితంలో ఒక ముఖ్యమైన అలవాటుగా మార్చుకున్న విశిష్ట వ్యక్తి డాక్టర్ బి ఎస్ కిరణ్ పాల్ అని అన్నారు.మచిలీపట్నం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం బెరాకా మినిస్ట్రీస్ అధినేత కిరణ్ పాల్, విద్యను అభ్యసించే పేద విద్యార్థులకు, వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్న పలువురు నిరుపేదలకు మంత్రి కొల్లు రవీంద్ర సూచనల మేరకు7,09,212 రూపాయలు 27 మంది నిరుపేదలకు అందించి తన సహృదయతను చాటారు.ముఖ్యఅతిథిగా పాల్గొన్న గోపీచంద్ నిరుపేద బెనిఫిషియర్స్ కు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా కష్టాల్లో ఉన్న నిరుపేదల కష్టం తెలిసిన వెంటనే తన వంతు సహాయం అందిస్తున్న బెరాకా మినిస్ట్రీస్ అధినేత డాక్టర్ బి.ఎస్ కిరణ్ పాల్ సేవలు చిరస్మరణీయం, అనన్య సామాన్యం, అన్నారు. ఆర్థికంగ విద్యా, వైద్య ఖర్చులకోసం ఇబ్బందులు పడే నిరుపేదలకు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 27 మంది నిరుపేదలకు 7,09,212/- రూపాయల చెక్కులు అందజేసిన బెరాకా మినిస్ట్రీస్ అధినేత కిరణ్ పాల్ సేవలు మరువలేని వన్నారు. సేవా భావం మనలో ఉన్న సహజమైన మంచి లక్షణం అని, తన మనసులో ఇతరుల కోసం సేవ చేయాలని కలిగే ఇష్టాన్ని సూచిస్తుందన్నారు. సేవాభావం ఉన్న వ్యక్తులు సమాజంలో అరుదుగా ఉంటారని, అలాంటి అరుదైన వ్యక్తుల్లో కిరణ్ పాల్ ఒకరని, సాటివారికి, కష్టాల్లో ఉన్నవారికి సహాయపడి ఇతరుల బాధలను ఆప్యాయంగా నయం చేసే అపర ధన్వంతరి కిరణ్ పాల్ అని అన్నారు. సమాజంలో సానుకూల మార్పును తీసుకురావడంలో సేవ ముఖ్యపాత్ర వహిస్తుందన్నారు.సేవా భావం మన దైనందిన జీవితంలో ఒక ముఖ్యమైన లక్ష్యంగా ఉండాలని, మన జీవితంలో ప్రతి క్షణం సేవాభావంతో నిండితే, మనము మాత్రమే కాక, సమాజం కూడా సంతోషంగా ఉంటుందన్నారు.. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని పెంపొందించుకోవాలన్నారు. బెరాకా మినిస్ట్రీస్ అధినేత కిరణ్ పాల్ సేవా భావంతో కులమతాలకు అతీతంగా అందించే సేవలు చిరస్మరణీయమని గొర్రెపాటి గోపీచంద్ కిరణ్ పాల్ ను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో టిడిపి 45వ డివిజన్ ఇంచార్జ్ పి. వి. ఫణి కుమార్, లోగిశెట్టి వెంకటస్వామి,డేవిడ్ రాజు, తుమ్మల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ వంతెన నిర్మాణం తొలగించేంత వరకు ఉద్యమం చేపడతాం








**నందివాడ, మేజర్ న్యూస్: మండల** పరిధిలోని రామాపురం గ్రామంలో మురుగు కాలువపై అక్రమ వంతెన నిర్మాణం చేపట్టడాన్ని నిరసిస్తూ శని వారం రైతుల ధర్నా కార్యక్రమం చేపట్టారు. రామాపురం నుండి అలిపిరాల వెళ్లే రహదారిలో కొన్ని వేల ఎకరాల చేపల చెరువులలోని మురుగు నీటిని వదిలేందుకు ఉపయోగించే ఈ ఈ కాల్వపై వైఎస్ఆర్సిపి పార్టీకి చెందిన పోతునూరి నాగబాబు అనే వ్యక్తి ఇరిగేషన్, డ్రైనేజీ డిపార్ట్మెంట్ అనుమతులు లేకుండా తన చెరువులోకి అక్రమంగా వంతెన ఏర్పాటు చేశారని, దీనివలన దిగువన ఉన్న చేపల చెరువులు, పంట పొలాలు వర్షాకాలం, తుఫాను సమయంలో వరద ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. నాగబాబుకు ప్రస్తుత అధికార పార్టీకి చెందిన కొంత మంది వ్యక్తులు అండతో అక్రమంగా కాలువపై తూమును ఏర్పాటు చేసి దానిపై వంతెన నిర్మించారని రైతులు తెలిపారు. ఈ వంతెన వలన భవిష్యత్తులో ఎన్నో వేల ఎకరాల పంట పొలాల, ఆక్వా సాగు, చేసే రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని, గత వరదల్లో కాలుపై ఎటువంటి వంతెనలు లేకపోయినా నీటి ప్రవాహం సరిగ్గా లేక చెరువులు,పంట పొలాలు నీటి మునిగాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.. ఈ అక్రమ వంతెన నిర్మాణంపై ఇరిగేషన్ డిఈని ఫోన్లో సంప్రదించగా తాము ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని చెప్పినట్లు రైతులు తెలిపారు. వెంటనే అధికారులు ఈ అక్రమ వంతెన నిర్మాణం తొలగించి రైతులను కాపాడాలని కోరుతున్నారు. ఈ అక్రమ వంతెన నిర్మాణం తొలగించేంత వరకు తమ ఉద్యమం కొనసాగిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన ఆక్వారైతు మెరుగు మాల లక్ష్మణరావు, రామాపురం నీటి సంఘం అధ్యక్షుడు సురేష్, వెన్ననపూడి గ్రామ టిడిపి నాయకుడు పొట్లూరి స్వామి, తదితర రైతులు పాల్గొన్నారు.

# ప్రజా రంజక బడ్జెట్ కాదు - ప్రజా వంచక బడ్జెట్




**గుడివాడ, మేజర్ న్యూస్:** ఉమ్మడి రాష్ట్రంలోనే రెండు లక్షల కోట్ల రూపాయల బడ్జెట్ని ప్రవేశపెట్టగా ఈ ప్రభుత్వం ప్రత్యేక రాష్ట్రంలో 3 లక్షల 22 వేల 329 కోట్ల రూపాయలు బడ్జెట్ ని ఆర్భాటంగా ప్రవేశపెట్టి సామాన్య ప్రజలకు ఏ విధమైన ప్రయోజనం లేకుండా కార్పొరేట్లకు అనుకూలమైన విధానాలతో ముందుకు వెళుతుందని సీపీఎం గుడివాడ కార్యదర్శి ఆర్సిపి రెడ్డి విమర్శించారు. స్థానిక సుందరయ్య భవనంలో సాహితీ స్రవంతి అధ్యక్షులు సురేంద్రతో కలిసి శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమాన్ని విస్మరించారని శతకోటీశ్వరులకు రాయితీలు ఇచ్చి సామాన్యులపై పన్నుల భారాన్ని పెంచే విధంగా ఈ బడ్జెట్ కనిపిస్తోందన్నారు. రానున్న కాలంలో ప్రజలను సమీకరించి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటాలు జరపనున్నామని చెప్పారు. ప్రభుత్వం ఇది ప్రచారంజక బడ్జెట్ అని చెప్పుకుంటుంది కానీ ఆచరణలో ప్రజా వంచక బడ్జెట్ గా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గత బడ్జెట్లో డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాల కోసం 950 కోట్ల రూపాయల కేటాయించగా ఈ బడ్జెట్లో 100 కోట్లు మాత్రమే కేటాయించడం దారుణమన్నారు. పాఠశాలకు ఉచిత కరెంటు, మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో 20వేల రూపాయల ఆర్థిక సహాయం మాత్రమే కొద్దిగా ఊరట కల్పించే అంశాలుగా కనిపిస్తున్నాయన్నారు. ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్, అమెరికా, వంటి దేశాల్లో కార్పొరేట్ టాక్స్ 25% నుంచి 35 శాతం వరకు ఉండగా మనదేశంలో మాత్రం 20 శాతమే ఉండటం దారుణమన్నారు. కార్పొరేట్లకు రాయితీలు ఇస్తూ సామాన్యులపై భారాన్ని మోపి ప్రభుత్వం ఎండ గడుతూ పెద్ద ఎత్తున పోరాటాలు జరుపవలసిన అవసరం ఉందన్నారు.

# లిడ్ క్యాప్ కార్పొరేషన్‌కు రూ.300కోట్లు నిధులు విడుదల చేయాలి



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చర్మ కార సంక్షేమ అభివృద్ధి సంస్థకు (లిడ్ క్యాప్)ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రూ 300 కోట్ల నిధులను త్వరలో జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించాలని రాష్ట్ర చర్మ కార సంక్షేమ సంఘం, ఎస్సీ ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ అధ్యక్షులు బుల్లా రాజారావు ప్రభుత్వాన్ని కోరారు. ఎన్టీఆర్ జిల్లా జి కొండూరు గ్రామంలో లీడ్ క్యాప్ పరిరక్షణ సమితి ఉమ్మడి కృష్ణా జిల్లాల కార్యదర్శి బట్టపర్తి రాజు స్వగృహంలో శనివారం ఉదయం విలేకర్లసమావేశం జరిగింది. ఈ సందర్భంగా బుల్లారాజారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎం అజయ్ పథకం కింద చర్మకారుల సంక్షేమం కోసం కోట్లాది రూపాయలు నిధులను మంజూరు చేసింద ని,వాటిలో చర్మకారుల కోసం 300 కోట్ల రూపాయలు నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తే చర్మకారుల నిరుద్యోగులు, యువతీ,యువకులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా లిడ్ క్యాప్‌కు చెందిన స్థలాలు, భవనాలు అన్యాక్రాంతమై కబ్జాకు గురి అయ్యాయని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వం స్పందించి వాటిని తిరిగి స్వాధీనం చేసుకొని సంస్థకు తిరిగి కేటాయించాలని తద్వారా ప్రభుత్వానికి కూడా ఆదాయ లభిస్తుంద న్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో లెదర్ పార్కులను నిర్మించి చర్మకారుల జీవితాలలో వెలుగు నింపాలని కోరారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చర్మ కారులు, డప్పు కళాకారులు ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ నుండి 2 లక్షల రూపా యలు మంజూరు చేసి వారిని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని రాజారావు కోరారు. వెల్లటూరు గ్రామంలో మినీ లెటర్ పార్క్ నిర్మాణానికి నిధులు రూ 5.50 కోట్లు నిధులు రెండేళ్ల క్రితం విడుదల అయ్యాయని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, పార్లమెంటు సభ్యులు కేశినేని శివ నాథ్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాలవీరాంజనేయ స్వామి, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి, లిడ్ క్యాప్ సంస్థ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు లు తక్షణమే స్పందించి అక్కడ నిర్మాణాలు చేపట్టాలని రాజారావు కోరారు. అనంతరం బుల్లా రాజారావు, న్యాయవాది రాంబాబు,బుల్ల రాజులను పలువురు ఘనంగా సన్మానించినారు.ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సీనియర్ న్యాయవాది కురగంటి రాంబాబు, రాష్ట్ర చర్మకార సంక్షేమ సంఘం కార్యదర్శి బుల్లా రాజు, జాతీయ మానవ హక్కుల సంఘం సభ్యురాలు సంది పాము లిల్లి మ్మ, నాయకులు బ ట్టపర్తి శేఖర్ బాబు, నూతక్కి ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లావ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాలు నిర్వహించిన కృష్ణాజిల్లా పోలీసులు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మహిళ భద్రతే ప్రాధాన్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వారి యొక్క ఉత్తర్వులపై, గౌరవ డిజిపి హరీష్ కుమార్ గుప్త. ఆదేశాల మేరకు, జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా వ్యాప్తంగా మార్చి 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో, మార్చి 1వ తేదీ నుండి 7 తేదీ వరకు జరుగు వారోత్సవాలలో భాగంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓపెన్ హౌస్, మెడికల్ క్యాంపు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ ప్రాంగణంల లో పాఠశాలల, కళాశాల విద్యార్థులతో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించి సమాజంలో మహిళల పాత్ర, మహిళా సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక ప్రాధాన్యతను, మహిళా సాధికారతకు సంబంధించిన అంశాలకు గురించి అవగాహన కల్పించడం జరిగింది. పోలీస్ స్టేషన్ రిసెప్షన్, దాని పనితీరు, కేసు ఏ విధంగా నమోదు చేస్తారు, దాని దర్యాప్తు ఏ విధంగా కొనసాగుతుంది, కమ్యూనికేషన్ వ్యవస్థ యొక్క పనితీరు, ఉమెన్ హెల్ప్ డెస్క్, మహిళల భద్రతకు ఏ విధంగా పనిచేస్తుంది, మహిళలకు ఉండే హక్కులు వారికి గల ప్రత్యేక చట్టాల గురించి తెలియజేయడం జరిగింది. మహిళా చట్టాలు, ఫోక్సో యాక్ట్, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, గుడ్ టచ్ అండ్ బాడ్ టచ్, సామాజిక మాధ్యమాలలో జరుగుతున్న నేరాలు, వాటి నుండి తప్పించుకోవడానికి ఏ విధంగా జాగ్రత్త పడాలి, వంటి అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులంతా ఎంతో ఉత్సాహంగా పాల్గొని వారికి ఉన్న సందేహాలను పోలీసు అధికారులను అడిగి వారి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. అలాగే వారికి ఏదైనా సమస్య ఉంటే ఏ విధంగా పోలీసు వారిని సంప్రదించాలో కూడా అడిగి తెలుసుకున్నారు. మచిలీపట్నం మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బందికి జిల్లా పోలీస్ యూనిట్ హాస్పిటల్‌లో వైద్యులచే మెడికల్ క్యాంపు నిర్వహించి అందరికీ ఉచితంగా వైద్య పరీక్షలు చేయడం జరిగింది. అవసరం మేరకు వారికి మందులు కూడా అందజేశారు.

## నూరు శాతం పింఛన్లు పంపిణీ



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మండలంలో ఉదయం 7 గంటల నుండి పెన్షన్ లబ్ధిదారులకు పంచాయతీ కార్యదర్శులు సచివాలయం సిబ్బంది పంపిణీ చేశారు శనివారం ఉదయం అశ్వరావు పాలెం గ్రామ సచివాలయ పంచాయతీ కార్యదర్శి గ్రేడ్ 6 డి పద్మావతి 7 గంటలకు ప్రారంభించి 9 గంటల సమయం అయ్యేసరికి తన పరిధిలోని 70 పెన్షన్లల దారులకు పూర్తి స్థాయిలో పంపిణీ చేశారు. వేకనూరు గ్రామానికి చెందిన మాదివాడ వెంకట కృష్ణారావు తన వ్యాపార నిమిత్తం తెల్లవారుజామునే నాగాయలంకలోని మార్కెట్‌లో వ్యాపారం చేసుకుంటున్న వెంకట కృష్ణారావు ను ఫోన్ ద్వారా సమాచారం తెలుసుకున్న పద్మావతి ఆప్రాంతానికి వెళ్లి తన పెన్షన్ 4000 రూపాయలు అందజేయడంతో ఆనందం వ్యక్తపరిచాడు కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ప్రతినెల ఉదయం రెండు మూడు గంటల వ్యవధిలోనే తన పరిధిలోని పెన్షన్ దారులకు పంపిణీ అందజేయడంతో గ్రామస్తులు పద్మావతిని అభినందిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 7 గంటలకు పెన్షన్లు పంపిణీ ప్రారంభించడంతో ఎక్కడ ఏ విధమైన సర్వర్లు మొరాయించకపోవడంతో పెన్షన్లు పంపిణీ కార్యక్రమం త్వరితగతిన పూర్తి అయినది.

## పుట్టినరోజు వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** అవనిగడ్డ మాజీ ఉపసర్పంచ్ అడపా శీను పావని దంపతుల ముద్దుల చిన్నారి హిత్విక్ మొదట పుట్టినరోజు వేడుకలకు హాజరైన మాజీ శాసనసభ్యులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి చిన్నారికి ఆశీస్సులు అందజేశారు. శుక్రవారం రాత్రి అవనిగడ్డ ఏ ఎస్ ఆర్ కళ్యాణ మండపంలో జరిగిన జన్మదిన వేడుకలలో గుంటూరు జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు అడపా మాణిక్యాలరావు నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, శీలం అశ్విన్ లతోపాటు నియోజకవర్గంలోని కూటమి నాయకులు ప్రజా ప్రతినిధులు అభిమానులు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.

# మామిడి పంటలో సస్యరక్షణ కీలకం



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మామిడి పంటలో సస్యరక్షణ కీలకమని, పంటలో చీడ పీడల యాజమాన్యంపై ప్రతి రైతు అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ సుధారాణి రైతులకు సూచించారు. క్షణ కార్యక్రమం నిర్వహించా స్థానిక పంచాయితీ కార్యాలయ ఆవరణలో శనివారం మామిడి రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాల శాస్త్రవేత్తలు డాక్టర్ సుధారాణి అధ్యక్షతన ధరణి కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూప్రస్తుతం మామిడి పూత దశలో ఉందని, తేనె మంచు పురుగులు, తామర పురుగులు, పిండి పురుగులు ఆశించి నష్ట పరుస్తున్నాయని వాటి నివారణపై రైతులకు పలు సూచనలు చేశారు.తేనె మంచు పురుగులు నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ లేదా థయోమిథాక్సం 0.3 గ్రా లీటరు నీటికి చొప్పున కలుపుకుని పిచికారి చేసుకోవాలని, పండు ఈగ ఉనికి, ఉధృతి తెలుసుకోవడానికి మిథైల్ యూజినాల్ ఎర బుట్టలను ఎకరానికి 5 చొప్పున పెట్టుకోవాలన్నారు తదుపరి మామిడి తోటల్లో క్షేత్ర సందర్శన చేసి ప్రస్తుత కాలంలో తీసుకోవాల్సిన యాజమాన్య చర్యల గురించి రైతులకు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాస్త్రవేత్త మంజువాణి, సస్యరక్షణ శాస్త్రవేత్త రేవతి, తనూజ పలువురు రైతులు పాల్గొన్నారు.

## టీడీపీ కార్యకర్త కుటుంబానికి లంక లితీష్ ఆర్థిక సాయం



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మైలవరం పట్టణంలో తెలుగు దేశం పార్టీ సీనియర్ లీడర్ దద్దనాల గోపాలరావు శనివారం ఉదయం ఆకస్మికంగా చనిపోయారు. గోపాలరావు కుటుంబాన్ని పరామర్శించి, తెలుగుదేశం పార్టీ మీ కుటుంబానికి అన్నివేళలా సహాయ, సహకారంగా ఉంటుందని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా మైలవరం నియోజకవర్గం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ స్ఫూర్తితో తెలుగు యువత అధ్యక్షుడు లంక లితీష్ తన సొంత నిధుల నుండి గోపాలరావు కుటుంబానికి రూ.5000ల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం నాయకులు, కార్యకర్తలు, తెలుగుయువత, తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ నేత ధరణికోట రామారావు భౌతికకాయానికి నివాళులు అర్పించిన జంపాల సీతారామయ్య



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి మున్సిపాలిటీ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ధరణికోట రామారావు (ధరణికోట శ్రీనివాసరావు తండ్రి) అకాల మరణం విచారకరమని తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి జంపాల సీతారామయ్య అన్నారు. శనివారం వారి స్వగృహంలో రామారావు భౌతికకాయానికి కొండపల్లి మున్సిపాలిటీ కూటమినేతలతో కలసి పసుపుకండువా కప్పి నివాళులర్పించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నూబోయన చిట్టిబాబు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

## బిసిల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది



**నందిగామ, మార్చి 1, మేజర్ న్యూస్:** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, జాతీయ బిసి సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ ఇంచార్జి యల గాల నూకానమ్మ యాదవ్ అన్నారు. శనివారం పత్రిక ప్రకటన ద్వారా తెలుపుతూ బిసిల సంక్షేమానికి 47,500 కోట్లు కేటాయింపు హర్షనీయం, కూటమి ప్రభుత్వం వెనకబడిన తరగతుల వెన్నుముక లా ఉంది అని అనిపిస్తుంది.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వివిధ బిసి పథకాలకు నిధులు కేటాయించి బిసిలకు నూతన జవాసత్వాలు కల్పించారు. ప్రభుత్వ హయాంలో బిసిలకు 32 పథకాలు, ఆదరణ పథకం ఉండేవి వాటి కోసం అప్పట్లో నిధులు కేటాయించి లబ్దిదారులకు ఇచ్చింది. కాని వైసీపీ ప్రభుత్వం రాగానే ఆ పథకాలు అన్ని నిర్వీర్యం చేసింది. జగన్ ప్రభుత్వం బిసిల వెన్ను విరిచింది.ఆదరణ పథకాన్ని పునరుద్దరిస్తూ, 1000 కోట్లు నిధులు కేటాయించడం అభినదనీయం అన్నారు. బిసిల తరపున చంద్రబాబు కి, కూటమి ప్రభుత్వనికి ధన్యవాదములు కృతజ్ఞతలు తెలిపారు.

## పెన్షన్ దారులకు సకాలంలో పెన్షన్ పంపిణీ



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర ఆదేశాల మేరకు శనివారం ఉదయం అధికారులు, సచివాలయం సిబ్బంది లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్కిల్ 3 పరిధిలోని రామలింగేశ్వర నగర్ లో పెన్షన్ పంపిణీ చేసిన ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు సి డి) పి.వెంకటనారాయణ మాట్లాడుతూ, కమిషనర్ ఆదేశాల మేరకు లబ్ధిదారులందరికీ సకాలంలో పెన్షన్ పంపిణీ చేస్తున్నారని, అధికారులు, సచివాలయం సిబ్బంది తమ పరిధిలోగల పెన్షన్ దారులు అందరికీ శనివారం ఉదయం నుండి ఫంక్షన్ పంపిణీ చేస్తున్నారని. శనివారం మధ్యాహ్నం మూడు గంటల వరకు నగరపాలక సంస్థ పరిధిలోగల సర్కిల్ 1 పరిధిలో 20,392 పెన్షన్ లకు 17,065, సర్కిల్ 2 పరిధిలో ఉన్న 25,676 గాను 23,390 సర్కిల్ 3 పరిధిలో ఉన్న 20,437 గాను 17,540 పెన్షన్లు పంపిణీ చేశారని, మిగిలినవి కూడా సత్వరమే పూర్తి చేసి పింఛన్ లబ్ధిదారులకు సత్వరమే అందిస్తారని తెలిపారు.

# ఫ్యూచర్ శాస్త్రవేత్తలుగా పిల్లలు మారాలి






**శ్రీచైతన్యలో సైన్స్ ఎక్స్ పోలో ప్రధానోపాధ్యాయులు కె.మహాలక్ష్మి**

**కృష్ణలంక, మేజర్ న్యూస్ :** స్థానిక శ్రీ చైతన్య కృష్ణలంక శాఖలో నేషనల్ సైన్స్ డే సందర్భంగా పాఠశాల ఆవరణలో సైన్స్ ఎక్స్ పో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.మహాలక్ష్మి మాట్లాడుతూ పిల్లలందరూ వర్ధమాన శాస్త్రవేత్తలు ఫ్యూచర్ శాస్త్రవేత్తలుగా మారాలని ఆకాంక్షించారు. పిల్లలో సైన్స్ పట్ల ఆసక్తి శాస్త్రీయ దృక్పదాన్ని విజ్ఞానాన్ని పెంపొం దించడానికి మాయి సైన్స్ ఎక్స్ పో ఎంతో దోహదపడుతుంది. "సైన్స్ లేని రెలిజిన్ గుడ్డిది, రెలిజిన్ లేని సైన్స్ కుంటిది" అని ఆల్ బెర్ట్ ఐన్ స్టీన్" చెప్పిన మాటల్లో జీవిత సత్యాలు మానవ జీవితంలో శక్తి, పరిరక్షణ, వ్యవ సాయం, ఆరోగ్యం, రవాణా, కమ్యూనికేషన్ రక్షణ, ఆర్థికశాస్త్రం విశ్రాంతి, అన్వేషణపై ప్రజావిధానం, వ్యక్తిగత నిర్ణయాలను తెలిజేయడానికి సైన్స్ ఉపయోగపడు తుందని ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా విచ్చేసిన అమరా వతి ఐ హాస్పటల్ డాక్టర్ అప్తాల్లోలాజిస్ట్ కేతినేని శైలజ మాట్లాడుతూ పిల్లలకు సైన్స్ పట్ల ఆసక్తిని అభినందించారు. ఉత్తమ ప్రాజెక్టలకు మెడల్స్, సర్టివికెట్స్ ప్రధానం చేశారు. విద్యార్థులు సుమారు 200 ప్రాజెక్టు ప్రదర్శనకు ఏర్పాటు చేశారు. వానిలో లైవ్ డెమాన్ స్ట్రేషన్, యాసిడ్ రైన్, ఎయిర్ పొల్యూషన్ ఎర్త్ కేక్ అలారమ్ కెలడోస్కోప్, ఐటానిక్ ఆఫ్ మిషన్, వాటర్ మౌన్ టైన్, వాటర్ సైకిల్, హెల్తీఫుడ్ జంక్ ఫుడ్ మొదలైన ప్రాజెక్టులు ఆద ర్శంగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో ఈజియం యం.మురళి కృష్ణ, ఆర్.ఐ. జె.రాజేష్ బాబు, అకడమిక్ కోఆర్డినేటర్, జోనల్ ఇన్ చార్జులు, ఉపాధ్యా యులు, తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.




18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు **ఎస్.వెంకటే,** ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999




# అశృనివాళి

అనురాగం, ఆప్యాయత, మంచితనానికి మారుపేరుగా నిలిచిన మీ నిష్క్రమణం మాకు తీరని లోటు, మీ జ్ఞాపకాలు మా మదిలో ఎల్లప్పుడు మెదులుతూనే ఉంటాయి. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తూ... శోకతప్త హృదయాలతో...
ఇట్లు..

మీ కుటుంబ సభ్యులు

పెద్ద కుమారుడు: వంశీ చైతన్య బి. భార్య: జయలక్ష్మి ఆర్. మనుమలు: ప్రణీత్ & వినీత్
2వ కుమారుడు: గణేష్ సౌజన్య, భార్య: మాధురి ప్రకాష్ మనుమడు: ఇషాంత్ కార్తిక్
3వ కుమారుడు: మానస తేజ, భార్య: అనూష మనుమరాలు: షామిలి

కీ॥శే॥ డా॥ బొమ్మి సీతారామస్వామి గారు
జననం: 15-01-1954 మరణం: 20-02-2025

పెద్దకర్మ: తేది: 02-03-2025 ఆదివారం హనుమాన్ జంక్షన్, గుడివాడ రోడ్డులో మా స్వగృహము నందు జరుపబడును
తదుపరి కార్యక్రమం : స్థానిక విజయవాడ రోడ్డులోని కాకాని కళ్యాణ మండపంలో జరుగుతుంది